ప్రజాశక్తి
గురువారం 12 జూన్ 2025 | 6 | అనంతపురం

సెలవులకు టాటా.. బడి బాట..!

కొత్త విద్యా సంవత్సరానికి సమయం అసన్నమైంది. రెండు నెలల విరామం తర్వాత పాఠశాలు పున:ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు గురువారం తెరుచుకోనున్నాయి. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానుండడంతో విద్యార్థులు సెలవులకు టాటా చెప్పి బడి బాట పట్టనున్నారు. రెండు నెలలుగా మూగబోయిన పాఠశాలల్లో నేటి నుంచి సందడి కన్పించనుంది. 2025-26 కొత్త విద్యా సంవత్సరానికి స్వాగతం పలుకుతూ విద్యాశాఖ అధికారులు విద్యార్థులను పాఠశాలలకు ఆహ్వానిస్తున్నారు.

◆ నేటి నుంచి మోగనున్న బడిగంట
◆ పలు పాఠశాలల్లో సమస్యలు స్వాగతం
◆ తల్లికి వందనం కోసం ఎదురుచూపు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అన్ని పాఠశాలల పున:ప్రారంభానికి ఇప్పటికే విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆయా పాఠశాలల తరగతి గదులనూ సిద్ధం చేశారు. తరగతి గదులను విద్యార్థులకు అనుగుణంగా అధికారులు సిద్ధం చేశారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను పాఠశాలలకు పంపే ఏర్పాట్లలో నిమగ్నం అయ్యాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో దాదాపు 5200 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ పాఠశాలలు 3850, ప్రయివేటు పాఠశాలలు 1350 వరకు ఉన్నాయి. వీటి పరిధిలో 3.70 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. నేడు పాఠశాలలు తెరవనుండడంతో వీరంతా బడులకు వెళ్లనున్నారు.

పాఠశాలల్లో సమస్యలు

ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికీ అనేక సమస్యలు రాజ్యమేలుతున్నాయి. వైసిపి ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పనులు జరిపినా ఇంకా చాలా పాఠశాలల్లో సమస్యలున్నాయి. కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో పాఠశాలల అభివృద్ధికి తీసుకున్న చర్యలు కొత్తగా ఏమీ లేదు. పాఠశాలల అభివృద్ధికి నిధులు మంజూరు కూడా నామమాత్రంగానే జరిగింది. అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీటి సమస్య తదితర మౌలిక వసతుల కల్పన పూర్తి స్థాయిలో జరగలేదు. పట్టణ ప్రాంత పాఠశాలల్లో పరిస్థితి కాస్త మెరుగ్గా ఉన్నా, గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో సమస్యలు ఎక్కువగా కన్పిస్తున్నాయి. పాత తరగతి గదిల్లోనే పాఠాలు బోధించే పరిస్థితి చాలా పాఠశాలల్లో కన్పిస్తోంది. పలు పాఠశాలల్లో మరుగుదొడ్లు కూడా లేని పరిస్థితి ఉంది. మరుగుదొడ్లు ఉన్న పాఠశాలల్లో నీటి సమస్య కారణంగా వాటిని ఉపయోగించే స్థితి లేదు. దీంతో పిల్లలు ఆరు బయటకు వెళ్లక తప్పని దుస్థితి నెలకొంది. గ్రామీణ ప్రాంత పాఠశాలలకు ప్రహరీలు లేవు.

తల్లికివందనం కోసం ఎదురుచూపు

కూటమి ప్రభుత్వం ప్రకటించిన ఎన్నికల హామీల్లో అత్యంత ప్రాధాన్యమైనది తల్లికి వందనం అనే చెప్పాలి. గత వైసిపి ప్రభుత్వం అమ్మఒడి పేరుతో పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో కుటుంబంలో ఒకరికి రూ.15 వేలు ఇచ్చేవారు. కూటమి ప్రభుత్వం ఇంట్లో ఎంత మంది చదువుతుంటే అందరికీ ఇస్తామని ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత 2024-25 సంవత్సరానికి సంబంధించి ఈ కానుక ఇవ్వలేదు. ఈ ఏడాది పాఠశాలలు ప్రారంభం సందర్భంగా జూన్ 12న అంటే గురువారం నాడు ఈ డబ్బులను తల్లుల ఖాతాల్లో వేస్తామని చంద్రబాబు ప్రకటించారు. మరి అది ఏ మేరకు అమలు అవుతుందోనని తల్లిదండ్రులు ఎదురు చూస్తున్నారు. ఇక విద్యా కానుక కిట్లు అందించడంలో జాప్యం జరిగే అవకాశం కన్పిస్తోంది. పుస్తకాలను మాత్రం వెంటనే పంపిణీ చేస్తామని విద్యాధికారులు చెబుతున్నారు.

ప్రయివేటులో ఫీజుల మోత

ప్రతి ఏడాది లాగే ఈ సంవత్సరం కూడా ప్రయివేటు పాఠశాలల్లో ఫీజుల మోత మోగుతోంది. వివిధ సిలబస్‌ల పేరుతో కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు తల్లిదండ్రుల నుంచి ముక్కు పిండి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారు. ఒక విద్యార్థి కార్పొరేట్ పాఠశాలలో ఎల్‌కెజిలో చేర్పించాలంటే పుస్తకాలు, యూనిఫాం, పాఠశాల ఫీజు కలిపి దాదాపు రూ.30 నుంచి రూ.50 వేల వరకు ఖర్చు చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయి. 5 నుంచి 10 వరకు చదివే విద్యార్థులు ఉంటే రూ.లక్షకుపైగానే ఫీజుల భారం తల్లిదండ్రులపై పడుతోంది. విద్యాహక్కు చట్టం ప్రకారం ఫీజుల నియంత్రణ ఉండాల్సి ఉన్నా ఆచరణలో కన్పించడం లేదు. దీనికి తోడు ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో వారి వద్దనే పుస్తకాలు, యూనిఫాం కొనాలన్న నిబంధనతో తల్లిదండ్రులపై అదనపు భారం పడుతోంది.

1 అడుగు ముందుకు.. 2 అడుగులు వెనక్కు..!

కేంద్రం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై గురువారం నాటికి ఏడాది కాలం పూర్తయ్యింది. ఈ కాలంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో అభివృద్ధి చూస్తే ఒక అడుగు ముందుకు.. మూడడుగులు వెనక్కు అన్న చందంగా మారింది. ఒకటి, రెండు అంశాల్లో కొంత పురోగతి కనిపిస్తున్నా తక్కిన వాటిని అటకెక్కించిందన్న విమర్శ ఉంది. అన్ని రంగాల వారీగా అభివృద్ధి అంతంత మాత్రమే అన్న విమర్శ ప్రజల నుంచి వ్యక్తం అవుతోంది.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

◆ ఏడాది కూటమి పాలనలో పురోగతి అంతంతే ◆ హంద్రీనీవా ప్రధాన కాలువ ఒక్కటే కదలిక

సాగునీటి రంగం

సాగునీటి రంగంలో చూసినప్పుడు హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు ఈ ఏడాది కాలంలో కొంత పురోగతి కనిపిస్తోంది. దీనిపైనా జిల్లావాసుల్లో అసంతృప్తి ఉంది. ఎన్నికల ముందు కూటమి నేతలు హంద్రీనీవా ప్రధాన కాలువ వెడల్పు ఆరు వేల క్యూసెక్కులకు పెంచుతామని చెప్పారు. ఆచరణలోకి వచ్చే సరికి 3850 క్యూసెక్కులతోనే కాలువ వెడల్పు పనులను పూర్తి చేసే విధంగా టెండర్లు పిలిచింది. ఇక రెండో దశలో అందరూ వ్యతిరేకిస్తున్నా కాలువ లైనింగ్ పనులు చేపట్టింది. లైనింగ్ వల్ల భూగర్భ జలాలు పెరిగే అవకాశాన్ని స్థానికంగా కోల్పోతామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం దీన్ని పట్టించుకోవడం లేదు. ఈ రెండు పనుల కోసమని ఈ బడ్జెట్‌లో రూ.3800 కోట్లు కేటాయించింది. ఇందులో కొంత పురోగతి కనిపిస్తున్నా... ఈ ప్రాజెక్టుపై నిర్మించ తలపెట్టిన బిటపి, పేరూరు ఎత్తిపోతల పథకాల పరిస్థితి అగమ్యగోచరంగానే ఉంది. ఇప్పటికీ రెండు ప్రాజెక్టుల భూసేకరణనే చేపట్టలేదు. ఇక జిల్లాకు ఎంతో కీలకమైన తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. దీనిని పూర్తి స్థాయి ఆధునీకరణ చేపట్టాల్సి ఉండగా రూ.33 కోట్లతో మరమ్మతులతోనే సరిపెట్టే ఆలోచనలో ప్రభుత్వముంది. రూ.850 కోట్లతో చేపట్టిన సిఎల్‌డిపి సామూహిక బిందు తుంపర సేద్యం కింద ఉరవకొండ నియోజకవర్గంలో 50 వేల ఎకరాలకు నీటిని అందించే ప్రాజెక్టును చేపడతామని ఎన్నికలకు ముందు ప్రకటించారు. కాని ఇందులోనూ ఇప్పటికీ కదలిక కనిపించ లేదు.

వ్యవసాయం...

జిల్లాలో అత్యధిక మంది ఆధారపడినది వ్యవసాయ రంగం. అందులోనూ మొట్ట వ్యవసాయమే అధికంగా ఉంటుంది. ఎన్నికలకు ముందు ప్రకటించిన విధంగా బిందు, తుంపెర సేద్యానికి 90 శాతం సబ్సిడీతో ఇస్తామన్న హామీని ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమల్లోకి తీసుకొచ్చింది. వ్యవసాయంలో ఇతర అంశాలైన రైతు భరోసా ఇంత వరకు అందలేదు. గిట్టుబాటు ధరలు కల్పించే విషయంలోనూ, ప్రకృతి వైపరిత్యాలతో పంటలు దెబ్బతిన్న రైతులకు ఇచ్చే పరిహారం ఇప్పటికీ అందలేదు. రైతులు పరిహారం కోసం ఎదురు చూస్తున్నారు.

పారిశ్రామిక రంగం

ఉమ్మడి అనంతపురం జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని పెద్దఎత్తున హామీలిచ్చారు. ఏడాది కాలంలో మడకశిర ప్రాంతంలో రెండు పరిశ్రమల ఏర్పాటుకు ఉత్తర్వులిచ్చారు. వీటి కార్యరూపం ఎప్పుడు అన్నది ఇంకా తెలియాల్సి ఉంది. పెద్దఎత్తున సోలార్, విండ్ పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులిచ్చారు. వీటి వలన ఉపాధి పెద్దగా లభించబోదన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. పైగా భూములు వేలాది ఎకరాలను ప్రయివేటు సంస్థలకు కట్టబెట్టే విధంగా నిర్ణయాలు ఉన్నాయన్న విమర్శలున్నాయి. ఇప్పటి వరకు కొత్తగా పరిశ్రమ ఈ ఏడాదిలో ప్రారంభమైంది మాత్రం ఒక్కటీ లేదు.

సమస్యల వలయంలో కేంద్రీయ విశ్వవిద్యాలయం

విభజన హామీల్లో భాగంగా అనంతపురం జిల్లాకు కేటాయించిన కేంద్రీయ విశ్వవిద్యాలయం ఇంకా సమస్యల వలయం నుంచి బయటకు రాలేదు సొంత క్యాంపస్‌లో గత ఏడాది జులై నుంచి విద్యాబోధన ప్రారంభమైనప్పటికీ ఇంకా మౌలిక సదుపాయల కల్పన పూర్తవలేదు. శాశ్వత బోధనా సిబ్బంది నియామకాలు జరగలేదు. అనేక సమస్యల నడుమ విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో అక్కడి విద్యార్థులు పలుమార్లు నిరసన కార్యక్రమాలు సైతం చేపట్టారు. పూర్తి స్థాయి మౌలిక సదుపాయల కల్పన, విద్యాబోధన సిబ్బంది నియామకం తదితర వాటి కోసం నిధుల కేటాయింపులు చేపట్టాల్సి ఉంది. ఈ ఏడాదిలో అటువంటి కేటాయింపులు బడ్జెట్‌లో జరగలేదు.

మూలన పడ్డ కులధ్రువీకరణ దరఖాస్తులు

ప్రజాశక్తి-యల్లనూరు

యల్లనూరు మండలానికి రెగ్యులర్ తహశీల్దార్ లేక కుల ధ్రువీకరణ దరఖాస్తులు మూలన పడ్డాయి. గురువారం నుంచి కళాశాలలు, పాఠశాలలు పున్ణ ప్రారంభం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులకు కుల ధ్రువీకరణ పత్రాలు అవసరం కానున్నాయి. మండలంలో రెగ్యులర్ తహశీల్దార్ లేకపోవడంతో వీటి జారీలో నిర్లక్ష్యం కొనసాగుతోంది. విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని నెలలు కావస్తున్నా సంబంధిత అధికారుల పరిశీలన లేక అవి మూలన పడ్డాయి. ఉన్నతాధికారులు స్పందించి మండలంలో విద్యార్థుల సమస్యలను గుర్తించి కులధ్రువీకరణ పత్రాలను అందించే ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు.

వర్షాధార పండ్లతోటల పెంపకానికి చేయూత

డ్వామా పీడీ సలీంబాషా

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

వర్షాధార పండ్ల తోటల పెంపకానికి రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన కులాలు, చిన్న, సన్నకారు రైతులకు తోడ్పాటు అందిస్తున్నట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ సలీంబాషా తెలిపారు. 16 రకాల పండ్లు, 2 రకాల పూల తోటలు, మునగ పంటల సాగును జిల్లాలో విస్తృతంగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మామిడి, స్వీట్ ఆరెంజ్, యాసిడ్ లైమ్, జామ, చింతపండు, యాపిల్, బేర్, దానిమ్మ, సీతాఫలం, అంజీర్ ఆపిల్, బటర్ ఫ్రూట్, జాక్ ఫ్రూట్, గులాబీ, తదితర ఉద్యాన పంటలకు నిర్వహణ ఖర్చులు పంటను బట్టి వంద శాతం ఉచితంగా 2 నుంచి 3 ఏళ్ల వరకూ చెల్లిస్తారని తెలిపారు. 2025-26లో 8వేల ఎకరాల్లో ఉద్యాన పంటల పెంపకం చేపట్టేలా లక్ష్యం నిర్దేశించారని తెలిపారు. ఆసక్తిగల ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగిన చిన్న, సన్న కారు రైతులు సంబంధిత ఎంపిడిఒ లేదా ఎపిఒ లేదా గ్రామ క్షేత్ర సహాయకుల వద్ద దరఖాస్తు చేసుకోవాలన్నారు.

యువతకు ఉపాధి కల్పనే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

శింగనమల నియోజకవర్గంలో యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తెలియజేశారు. కొర్రపాడు సమీపాన బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం నాడు మెగా జాబ్‌మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ కృషితో రాష్ట్రానికి వివిధ రకాల కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు వస్తున్నాయన్నారు. ఈ కంపెనీల రాకతో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగు అవుతాయన్నారు. అనంతపురం జాబ్ మేళాలో ఉద్యోగానికి ఎంపికైన వారికి నియామక పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎడిసిసి బ్యాంకు ఛైర్మన్ కేశవ రెడ్డి, డిసిడిఒ ప్రతాప్ రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్ బాబు, మండల అధ్యక్షులు అశోక్, మాజీ జెడ్పిటిసి ఆలం వెంకట నర్సా నాయుడు, ఎంపీపీ సునీత, టిడిపి నాయకులు పసుపుల శ్రీరామ్ రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగ నియామక పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

బిజెపిని ప్రశ్నించే దమ్ము బాబు, జగన్‌కు లేదు..!

కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్.షర్మిల

◆ ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం
◆ కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేస్తాం
◆ ఎపి పిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిల

ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపిని ప్రశ్నించే దమ్ము చంద్రబాబు నాయుడు, వైఎస్.జగన్మోహన్ రెడ్డిలకు లేదని పిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిల రెడ్డి విమర్శించారు. బుధవారం నాడు అనంతపురం జిల్లాలో ఆమె పర్యటించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన విస్తత స్థాయి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో ఏ ఒక్క హామీని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ప్రకటించిన చంద్రబాబు ఈ ఏడాది కాలంలో 17 వేల కోట్ల భారాన్ని ప్రజలపై వేశారని పేర్కొన్నారు. సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన హామీలు కూడా అమలు చేయలేదన్నారు. నిరుద్యోగులకు ఇస్తామన్న నిరుద్యోగ భృతి ఇవ్వలేదని గుర్తు చేశారు. ఉచిత బస్సుల అమలు జరగలేదన్నారు. అన్ని రకాల హామీలను అమలు జరుపకుండా మోసం చేశారని విమర్శించారు. ఎన్నికల హామీల అమలుపై కాంగ్రెస్ పార్టీ పోరాటం సాగిస్తుందని చెప్పారు. కేంద్రంలో అధికారంలోనున్న బిజెపి విభజన హామీలు ఏ ఒక్కటీ అమలు చేయలేదని విమర్శించారు. వీటిని అమలు చేయాలని అడిగే దమ్ము అటు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, ఇటు మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డికి లేదని దుయ్యబట్టారు. చంద్రబాబుది బిజెపితో పొత్తు అయితే వైఎస్.జగన్మోహన్ రెడ్డి అక్రమ పొత్తు అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ బలమంతా వైసీపీ వైపు వెళ్లిందని చెప్పారు. ఆ బలాన్ని తిరిగి పొందే దిశగా కలిసికట్టుగా అందరం కలిసి పని చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.

షర్మిల ఎదుటే నేతల తోపులాట

పిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిల రెడ్డి ఎదుటే కాంగ్రెస్ నేతలు ఒకరు ఒకరు ఘర్షణ దిగారు. వేదికపైకి తమను పిలవకుండా అవమానించారంటు గుంతకల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి కావాలి ప్రభాకర్ వేదిక ఎదుట ఉన్న కుర్చీలో కాకుండా కింద కూర్చొని నిరసనకు దిగారు. ఆయన మద్దతుదారులు నిరసనగా దిగడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో తాను కూడా కుర్చీలో కాకుండా కిందనే కూర్చుంటానని షర్మిళ రెడ్డి కుర్చీలో కాకుండా కింద కూర్చున్నారు. అనంతరం నేతలు సర్ది చెప్పి షర్మిలను వేదిక పైన కుర్చీలో కూర్చోబెట్టారు. అటు తర్వాత కూడా నేతల మధ్య వివాదం సద్దుమణగ లేదు. డిసిసి అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి సమన్వయం చేయడంలో లోపం ఉందంటూ నినాదాలు చేశారు. దీంతో కొంతసేపు గందరగోళం నెలకొంది. నేతల మధ్య తోపులాట జరిగింది. తర్వాత షర్మిల రెడ్డి కలుగజేసుకుని నేతలు సమన్వయంతో పార్టీని బలోపేతానికి కృషి చేయాలని చెబుతూ సమావేశాన్ని కొనసాగించారు.

పంచాయతీ కార్మికులకు సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

బుక్కరాయసముద్రం పంచాయతీ కార్మికులుగా పనిచేస్తున్న కార్మికులకు నిత్యావసర సరుకులను సిఐటియు గ్రామపంచాయతీ వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం పంపిణీ చేశారు. పంచాయతీ పరిధిలో కార్మికునిగా పని చేస్తూ ఇటీవల మరణించిన పవన్ కుమార్, పక్షపాతంతో ఉన్న నల్లప్ప, అపెండిక్స్ ఆపరేషన్ వల్ల ఇబ్బందులు పడుతున్న ఎర్నాగయ్య, క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న తాడిపత్రి సూరమ్మ, చింతామణి వెంకటలక్ష్మిలకు ఒక్కొక్కరికి 100 కేజీల బియ్యం, రూ.2500 నిత్యావసర సరుకులు, కూరగాయలను అందించారు. ఖర్చుల నిమిత్తం రూ.1000 నగదు అందించారు. గ్రామపంచాయతీ వర్కర్ల యూనియన్, సిఐటియు అనుబంధ సంఘాల నుంచి ఇందిరా గాంధీ నగర్ కాలనీలో ఉన్న దాతల నుంచి సేకరించి వీటిని ఆ కుటుంబాలకు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఎ.పార్వతి, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, పండ్లతోటల రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.శివారెడ్డి, రైతు సంఘం నాయకులు ఆర్.కుళ్లాయప్ప, సిఐటియు మండల కార్యదర్శి సి.నాగేంద్ర, గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు ఎర్ర కొండప్ప, సుబ్రహ్మణ్యం, నాగరాజు, బాలప్ప, నాగేంద్ర, వెంకటమ్మ, లక్ష్మీదేవి, పవిత్ర పాల్గొన్నారు.

వసతి గృహాల్లో సన్నబియ్యంతో భోజనం : ప్రభుత్వ విప్

ప్రజాశక్తి-రాయదుర్గం

ఈ నెల 12వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, విద్యార్థి వసతి గృహాలు పున: ప్రారంభం కానుండగా అక్కడి విద్యార్థులకు అందించే భోజనంలో సన్నబియ్యాన్ని ఉపయోగిస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. కాలవ బుధవారం పట్టణంలోని తన నివాసం లో పాత్రికేయులకు పాఠశాలలు, వసతి గృహాల్లో ఉపయోగించే సన్నబియ్యాన్ని చూపించారు. ఆయన మాట్లాడుతూ గురువారం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు సన్నబియ్యంతో భోజనం సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా 281 పాఠశాలలు, వసతి గృహాలు ఉండగా వంద మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం కాగా ఇప్పటికే 50శాతం బియ్యం నిల్వలు ఆయా పాఠశాలలు, వసతి గృహాలకు చేర్చినట్టు తెలిపారు.

సన్న బియ్యాన్ని చూపుతున్న కాలవ

బళ్లారి-చిక్కజాజూరు రైల్వే లైన్ డబ్లింగ్‌కు పచ్చజెండా

రాయదుర్గం : కర్నాటకలోని బళ్లారి నుంచి రాయదుర్గం మీదుగా చిక్కజాజూరు రైలు మార్గం డబ్లింగ్ పనులకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. గురువారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో బళ్లారి-చిక్క జాజూరు(185 కి.మీ) రైలు మార్గం డబ్లింగ్ పనులకు రూ. 3,342 కోట్ల వ్యయంతో ఆమోదం లభించింది. రైలు మార్గం నిర్మాణానికి 174 హెక్టార్ల భూమిని స్వాధీనం చేసుకునేందుకు ప్రతిపాదనలు చేశారు. ఈ మార్గం చేపట్టడం వల్ల బళ్లారి ప్రాంతంలో మైనింగ్ పరిశ్రమలు, పర్యాటక అభివృద్ధికి, హుబ్బళ్లి- బెంగళూరు, హుబ్బళ్లి-గుంతకల్లు మార్గాలను కలపడం వల్ల సింగల్ లైన్ ట్రాఫిక్ సామర్థ్యం మెరుగుపడుతుంది.

పేదలకు విద్యుత్ మీటర్లు ఇవ్వండి

సిపిఎం నగర కార్యదర్శి రామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం నగర సమీపంలో నివసిస్తున్న పేదల ఇళ్లకు సంబంధించి విద్యుత్ మీటర్లు మంజూరు చేయాలని సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి డిమాండ్ చేశారు. విద్యుత్ మీటర్లకు మంజూరు నిమిత్తం ఏడాది క్రితం డిడిలు కట్టినా మీటర్లు ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ సూపరిండెంట్ ఇంజినీర్ కార్యాలయాన్ని బుధవారం ముట్టడించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ పేదల నివసిస్తున్న కాలనీలపై విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. రెవెన్యూ అధికారులతో ఏ ఇబ్బందులూ లేకపోయినా విద్యుత్ అధికారులు విద్యుత్ మీటర్లు ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఇదే ఆఫీసు దగ్గర సిపిఎం ఆధ్వర్యంలో పేదలకు కరెంటు కనెక్షన్లు ఇవ్వాలని ధర్నా చేశామని, అప్పుడున్న అధికారి డీడీలు కడితే మీటర్లు ఇస్తామని చెప్పారన్నారు. పేదలు డిడిలు చెల్లించి సంవత్సరం అవుతున్న మీటర్లు ఇవ్వడం లేదన్నారు. పేదలు ఉంటున్న ప్రభుత్వ భూమిని కొందరు తమదని డి6 అధికారి చెప్పడంతో కావాలనే ఆయన మీటర్లు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని చెప్పారు. ఎస్ఇ, ఇఇ, డిఇ మీటర్లు ఇవ్వాలని చెప్పినా డి6 ఖాతారు చేయడం లేదన్నారు. అధికారులు వెంటనే స్పందించి మీటర్లు మంజూరు చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఈఈ రమేష్, డిఈ శ్రీనివాసులు స్పందించారు. మీటర్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో పేదలు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రకాష్, మసూద్, ఇర్ఫాన్ మల్లు స్వరాజ్యం కాలనీ శాఖ కార్యదర్శి హాజీవలీ, శంషాద్, మోహన్ లాలెమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేదలతో కలిసి విద్యుత్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు

నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటా : ప్రభుత్వ విప్

ప్రజాశక్తి-రాయదుర్గం

నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటానని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. శాసనసభ్యునిగా ఏడాది పూర్తవుతున్న సందర్భం గా బుధవారం ఆయన తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ప్రజలు కూటమి పార్టీలకు అద్వితీయమైన మెజారిటీ ఇచ్చారన్నారు. సూపర్ సిక్స్, ఎన్నికల హామీలతో పాటు నిలిచిపోయిన అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రాయలసీమకు జీవనాడి అయిన హంద్రీనీవా కాలువ విస్తరణ పథకాన్ని యుద్ధ ప్రాతిపదికన చేపట్టామన్నారు. నియోజక వర్గంలో 7,500 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ సెంట్రల్ ట్రాన్స్‌మిషన్ యూనిట్ ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. బిటిపికి జీడిపల్లి నుంచి కృష్ణా జలాల ఎత్తిపోతల పథకం పనులను పున:ప్రారంభిస్తామన్నారు. ఆవులదట్ల, మాల్యం బ్రాంచ్ కెనాల్ పనులు చేపడతామన్నారు. 67 చెరువులకు సాగునీరు అందించేందుకు చేపట్టే పథకానికి డిపిఆర్ రూపొందిస్తామన్నారు. ఉంతకల్లు వద్ద బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. 'జలజీవన్ మిషన్' ద్వారా ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందిస్తామన్నారు. కణేకల్ వద్ద హెచ్ఎల్ఎంసి వంతెన నిర్మాణానికి స్థలం మార్పిడి చర్యలు జరుగుతున్నట్లు తెలిపారు. గోనేహాళ్ వద్ద ఆగిన బిసి బాలికల ఆశ్రమ పాఠశాల భవన నిర్మాణాలను తిరిగి చేపడతామన్నారు. రాయదుర్గం పట్టణంలో అనంతపురం, కణేకల్ రోడ్డు వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనులను పూర్తిచేయాలని రైల్వే మంత్రి, అధికారులను కోరినట్లు తెలిపారు. రూ. 35 కోట్ల వ్యయంతో తుంగభద్ర ఎగువ కాలువ మరమ్మతులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నట్లు తెలిపారు. వరి, కంది పంటలు పండించిన రైతులకు గిట్టుబాటు ధర కల్పించి రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గాన్ని అభివృద్ధికి చిరునామాగా మారుస్తామని, శాంతి భద్రతల పరిరక్షణకు, ప్రశాంత వాతావరణంలో ప్రజలు జీవించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజల రుణం తీర్చుకోవ డానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

మీడియాతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాలవ

బీడీ కార్మికులకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు కేటాయించాలి

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో ఉన్న బీడీ కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఏపి బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన నాగేంద్రకుమార్ మాట్లాడుతూ బీడీ కార్మికులు 15 ఏళ్లుగా సొంతిల్లు లేక చాలీచాలని వేతనాలతో దుర్భర జీవితం గడుపుతున్నారన్నారు. వారికి ఇళ్ల స్థలాలు, ఇళ్ల కోసం పలుమార్లు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాలు చేపట్టినా, ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చినా ఫలితం లేదన్నారు. ప్రస్తుతం ఇచ్చిన లిస్టులో 1070 మంది మాత్రమే ఉన్నారన్నారు. తాడిపత్రి రూరల్ ప్రాంతంలోని రమేష్‌రెడ్డి కాలనీ, గోపాల్‌రెడ్డి కాలనీ, గన్నెవారిపల్లి కాలనీ, పట్టణంలోని పాతకోట, వడమటిగేరి ప్రాంతాలకు చెందిన బీడీ కార్మికుల పేర్లు అందులో లేవన్నారు. జగనన్న ప్రభుత్వం స్థలంలోని కొత్తగా ఇంటి స్థలంతో పాటు ఇల్లు నిర్మించి ఇచ్చేందుకు దరఖాస్తు చేసుకున్న బీడీ కార్మికుల లిస్టు విడుదల చేయాలన్నారు. సచివాలయాల ద్వారా లిస్టు వెరిఫై చేసి అర్హులను గుర్తించి ఇళ్ల స్థలాలు కేటాయించి ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. సచివాలయాల వద్ద విఆర్వోలు బీడీ కార్మికుల ఇళ్ల స్థలాల విషయంలో దుర్వినియోగానికి పాల్పడకుండా అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. బీడీ కార్మికుల సమస్యలు త్వరలో పరిష్కారం కాకపోతే తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని, రిలే దీక్షలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు డివిజన్ కార్యదర్శి ఉమాగౌడ్, కెవిపిఎస్ నాయకులు రామ్మోహన్, సిఐటియు నాయకులు హనుమంత్‌రెడ్డి, బీడీ కార్మిక సంఘం ఆరీఫా, రహీంబీ, రమీజా, షాను, బసిరున్, బీడీ కార్మికులు పాల్గొన్నారు.

ఏపి బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్

తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న బీడీ కార్మికులు, సిఐటియు నాయకులు

శ్రీచైతన్య విద్యాసంస్థలను సీజ్ చేయాలి

ఐక్య విద్యార్థి సంఘాల డిమాండ్

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

జిల్లాలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న శ్రీచైతన్య విద్యాసంస్థలను తక్షణమే సీజ్ చేయాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకుల డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, ఎఐఎస్‌బి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థి సమైక్య ఆధ్వర్యంలో నగరంలోని డిఇఒ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి, ఎఐఎస్‌బి జిల్లా ప్రధాన కార్యదర్శి పృథ్వీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ విద్యార్థి సమైక్య రాష్ట్ర కార్యదర్శి సురేష్ యాదవ్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా శ్రీచైతన్య విద్యా సంస్థలు జిల్లా విద్యాశాఖ అధికారులకు దొంగ పత్రాలు ఇచ్చి అనుమతులు పొందాయన్నారు. విద్యా సంస్థల పేరుతో ముద్రించిన పుస్తకాలు విక్రయిస్తున్నార న్నారు. శ్రీచైతన్య విద్యా సంస్థల అక్రమాలను ఆధారాలతో అందజేస్తామని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో ఆందోళనలు చేయడం తో పాటు రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

డిఇఒ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు

ధర్నాలో ఎస్ఎఫ్ఐ నాయకులు గిరి, విజయ్, సోము, అజయ్, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు హనుమంతరాయుడు, నాయకులు ఆంజనేయులు, వెంకటనాయక్, మంజు, రమణయ్య, నాని, సమీర్, బాబ్‌జాన్, మనోహర్, యశ్వంత్, కార్తీక్, జయ, తరుణ్, అక్బర్, ఎఐఎస్‌బి నాయకులు విజయ్, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి : ఎపిడబ్ల్యుజెఎఫ్

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రేపటి రామాంజినేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 'డిమాండ్స్ డే' లో భాగంగా జర్నలిస్టుల సమస్యలపై బుధవారం ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యంలో అన్ని దినపత్రికలు, టీవీ ఛానల్స్‌కు చెందిన జర్నలిస్టులు డిఆర్ఒ మలోలకు వినతి పత్రం ఇచ్చారు. రామాంజినేయులు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలకు ముందు కూటమిలోని అధినాయకులు జర్నలిస్టులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. ప్రతి వర్కింగ్ జర్నలిస్టుకు 3 సెంట్ల ఇంటి స్థలంతో పాటు ఇళ్ల నిర్మాణం, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అక్రిడిటేషన్లతో పాటు సంస్థల నుంచి గుర్తింపు కార్డులు, ఆరోగ్య బీమా, తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. లేనిచో దశల వారీగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు జయప్రకాష్, నాగభూషణ్, వేణుగోపాల్, నాయుడు, శ్రీరాములు, సూర్య, రామాంజనేయులు, శ్రీనివాసులు, జగదీశ్, కేశవ, రవీంద్ర, ఉపేంద్ర, విజయ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే గుంతకల్లులో ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ పరిపాలన అధికారి భూషణ్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బాపురం వెంకటేశ్వర్లు,పూజారి శ్రీనివాసులు, జర్నలిస్టులు రమేష్‌రెడ్డి, దాదాపీరా, తిమ్మప్ప, కె.రమేష్ బాబు, ఎం.రామాంజినేయులు, జానకిరాముడు, శివారెడ్డి, రామచంద్ర, బాబురావు,అలీబాషా,ఆనందరావు తదితరులు పాల్గొన్నారు. జర్నలిస్టుల సమస్యలపై కళ్యాణదుర్గంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు తిప్పేస్వామి, హరి, సోమశేఖర్‌రెడ్డి, రామకోటి, ఉమేష్, మురళి బుధవారం ఆర్డీవో వసంతబాబుకు వినతి పత్రం అందజేశారు.

అనంతపురంలో డిఆర్ఒ మలోలకు వినతి ఇస్తున్న ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు

అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-గుంతకల్లు

అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభు త్వం లక్ష్యమని, సిఎం చంద్రబాబు సహాయ సహకా రాలతో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపి స్తామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ తెలిపారు. ఆయన బుధవారం పట్టణంలో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. 3, 4, 25, 35వ వార్డుల్లోని గుత్తి రోడ్డు ప్రాంతం, చాక్లెట్ ఫ్యాక్టరీ ఎదురుగా, పోర్టల్ లైన్ దర్గా వద్ద, హౌసింగ్ బోర్డు కాలనీ బొరుగుల బట్టి ఏరియాల్లో రూ. 40 లక్షల నిధులతో చేపట్టనున్న మురుగు కాలువల నిర్మాణా నికి భూమిపూజ చేశారు. చెత్త సేకరణ కోసం రూ. 23 లక్షల నిధులతో మున్సిపాలిటీ కొనుగోలు చేసిన 2 నూతన ట్రాక్టర్లను ఛైర్‌పర్సన్ ఎన్.భవాని, కమిషనర్ నయీమ్ అహ్మద్‌తో కలిసి మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే ప్రారం భించారు. అనంతరం మండ లంలోని దోసలుడికి గ్రామంలో రూ. 9.2 లక్షల నిధులతో నిర్మించిన గోకుల షెడ్డు ను ప్రారంభించారు. గుండాల తండా గ్రామంలో రూ. 1.5 కోట్లతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థా పన చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, డిఎల్‌డిఒ విజయలక్ష్మి, తహశీల్దార్ రమాదేవి, మండల ఇన్‌ఛార్జి గుమ్మనూరు నారాయణ స్వామి, పట్టణ అధ్యక్షులు బండారు ఆనంద్, తలారి మస్తానప్ప, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, అంజి, చిప్పగిరి ప్రతాప్, యుగంధర్ పాల్గొన్నారు.

చెత్త తరలింపు ట్రాక్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్

'వేతనం సక్రమంగా అందుతోందా'

ఆత్మకూరు : 'వారమంతా పని చేసినా మూడు లేదా నాలుగు రోజులకే కూలి డబ్బులు ఇస్తున్నారు మేడం.. చాలా ఇబ్బందిగా ఉంది" అని ఉపాధి హామీ కూలీలు ఎంపిపి సుబ్బర హేమలత ఎదుట వాపోయారు. మండలంలోని పంపనూరు గ్రామం వద్ద చేపట్టిన ఉపాధి హామీ పని ప్రదేశాన్ని బుధవారం ఎంపిపి సందర్శించి కూలీలతో మాట్లాడారు. 4 నెలలుగా వేతనాలు అందడం లేదని... చేసిన పనులకు స్లిప్పులు ఇవ్వడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎంపిపి అధికారులతో మాట్లాడి బిల్లులు సక్రమంగా అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పంపనూరు సమీపంలోని నగరవనంలో మొక్కను నాటారు. కార్యక్రమంలో వన సంరక్షణ సమితి ప్రెసిడెంట్ సుభద్రమ్మ, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ శ్రీకాంత్, సర్పంచి ఎర్రిస్వామి, అటవీ శాఖ సిబ్బంది అనిల్, తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని వినతి

ఉరవకొండ : కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం నియోజకవర్గ కౌలు రైతుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, వెంకటేశులు ఆధ్వర్యంలో విజయవాడలోని దేవాదాయ శాఖ కమిషనర్‌కు వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ మండలంలోని రేణుమాకులపల్లి గ్రామంలో ఉన్న శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ భూమిని అదే గ్రామానికి చెందిన వన్నూరుస్వామి, నారాయణస్వామి, పార్వతి, వీరయ్య, ఓబుళమ్మ, సుధా, లింగరాజు, నగేష్ కొన్నేళ్ల నుంచి కౌలుకు చేసుకుని కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. కావున వారికే గుత్త రసీదులు ఇవ్వాలని, సిసిఆర్‌సి కార్డులు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు.

'ఉపాధి' కూలీల సంఖ్య పెంచండి

ప్రజాశక్తి-పుట్లూరు

మండల వ్యాపంగా అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలని ఎంపీ డీవో అలివే లమ్మ టిక్నికల్ అసిస్టెంట్లకు సూచిం చారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవా రం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో ఉపాధి పనులు కల్పించాలన్నారు. అందులో భాగంగా ఫారం పాండ్లు తవ్వాలని, కూలీలకు కనీస వేతనం రోజుకి రూ. 300 పడేలా అవగాహన కల్పించాలన్నారు. ఇంకుడు గుంతలు, కొత్తగా హార్టికల్చర్ జాబితా తయారు చేయాల న్నారు. పశువుల షెడ్స్ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎపిఒ నరేంద్ర, ఈసి అంజనకుమార్ పాల్గొన్నారు.

27 వరకూ ప్రత్యేక ఆధార్ క్యాంప్

ఈ నెల 12 నుంచి 27వ తేదీ వరకూ ప్రత్యేక ఆధార్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అలివేలమ్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 12, 13 తేదీల్లో పుట్లూరు, ఎల్లుట్ల, 24, 25 తేదీల్లో తక్కల్లపల్లి, కుమ్మనమల, 26, 27 తేదీల్లో తక్కల్లపల్లి, మడుగుపల్లి గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు ఏర్పాటు చేస్తామరని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అదునులో విత్తన సాగు లాభదాయకం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

అదునులో వర్షం కురవడంతో ఖరీఫ్ విత్తన సాగుకు అనుకూలిం చింది. దీనిని సద్వినియోగం చేసుకుని విత్తనం వేస్తే ఎంతో లాభదాయకమని కెవికె కోఆర్డినేటర్ చంద్రాయుడు, ఎడిఎ యల్లప్ప సూచించారు. పట్టణంలోని కెవికెలో బుధవారం ఏరువాక పౌర్ణమి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఏవో వాసుకిరాణి, కెవికె శాస్త్రవేత్తలు బాలాజీనాయక్, శిరీష, ఆరు మండలాల ఆదర్శ రైతులు హాజరయ్యారు. కెవికె కోఆర్డినేటర్, ఎడిఎ మాట్లాడుతూ ఏరువాక పౌర్ణమి సందర్భంగా వర్షాలు కురవడం, అదే సందర్భంలో విత్తన సాగుకు అనుకూలిం చడం శుభసూచికం అన్నారు. రైతులంతా వెంటనే విత్తన సాగు ప్రారంభించాల న్నారు. ఇప్పటికే ఆర్ఎస్‌కెల్లో విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. సాగు చేయడానికి అనవసరంగా ఎక్కువ ఖర్చు చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో హార్టికల్చర్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కెవికె ఆవరణలో విత్తనం వేస్తున్న అధికారులు

జీడిపల్లి రిజర్వాయర్‌ను సందర్శించిన శిక్షణ కలెక్టర్లు

ప్రజాశక్తి-బెళుగుప్ప

ఎపి దర్శన్ ప్రోగ్రామ్‌లో భాగంగా శిక్షణ కలెక్టర్లు బుధవారం మండలంలోని జీడిపల్లి రిజర్వా యర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు పంప్ హౌస్‌లు పని చేసే విధానంపై వారికి వివరించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా వారు మండలంలోని పూనం పల్లి గ్రామంలో పర్యటించగా ఉద్యాన శాఖ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఫిరోజ్ ఖాన్ ఎపి మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా రైతులకు అందిస్తున్న డ్రిప్పు, స్ప్రింక్లర్లు, వాటి సబ్సిడీ గురించి వివరించారు. అనంతరం వారు ఆత్మకూరు మండలంలోని కొత్తపల్లి గ్రామం వెళ్లగా డ్వామా పిడి సలీంబాషా ఎన్ఆర్ఈ జిఎస్ ద్వారా డ్రిప్పు కింద సాగుతున్న ఉద్యాన పంటల సాగు, ప్రోత్సాహం గురించి వివరించారు. పర్యటించిన వారిలో శిక్షణ కలెక్టర్లు సచిన్ రాధా, చిట్టపులి నరేంద్ర, పృథ్వీ, రాజ్‌కుమార్, మనీషా, ప్రహన్, జాహిద్, రఘు, చిరంజీవి, నాగవెంకట్, సాహిత్, కమల ఉన్నారు. వారి వెంట ఆర్‌డిఒ వసంత బాబు, తహశీల్దార్ అనిల్‌కుమార్, హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు, హార్టికల్చర్ అధికారి కృష్ణతేజ, మైక్రో ఇరిగేషన్ అధికారి మల్లేష్, హార్టికల్చర్ అసిస్టెంట్లు, రైతులు ఉన్నారు.

డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్లుగా మార్పు

ప్రజాశక్తి-అనంతపురం

వైద్య ఆరోగ్యశాఖలో క్షేత్ర స్థాయిలో సుదీర్ఘకాలం విధులు నిర్వహిం చే వైద్య సిబ్బందికి నూతన వ్యాధులు, ఇతర అంశాలపై అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ క్యాడర్ ఉద్యోగులను ఇకపై డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్లుగా పేరు మార్పు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. దీంతో ఎపి హెల్త్ ఎడుకేటర్స్ సర్వీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అనంతపురం జిల్లా అధ్యక్షులు సి.సుబ్రహ్మణ్యం, కార్యదర్శి యు.వెంకటరమణ, కోశాధికారి ఎన్.వేణుగోపాల్, మహమ్మద్‌షఫీ, సహాయ అధ్యక్షులు మహాపర్వీన్, కె.లక్ష్మినారాయణ, జె.సత్యనారాయణ, విజయభాస్కర్, సి.వెంకటేష్, విజయ భారతి, కార్యవర్గ సభ్యులు బుధవారం డిఎంహెచ్ఒ డాక్టర్ ఈబి.దేవిని మర్యాద పూర్వకంగా కలిసి జివో కాపీ అందజేశారు. డిఎంహెచ్ఒ జిల్లాలోని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్లకు అభినందనలు తెలిపారు.

బాలికల హాస్టల్‌లో అవకాశం కల్పించండి

ప్రజాశక్తి-శింగనమల

స్థానిక ప్రభుత్వ బాలికల హాస్టల్‌లో 9, 10 తరగతులు చదివే విద్యార్థినులతో పాటు 6, 7, 8 తరగతులు చదివే విద్యార్థినులకు అవకాశం కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కన్వీనర్ ఎస్‌కె.తిరుపాలు, కుళ్లాయప్ప కోరారు. ఈ మేరకు బుధవారం కొర్రపాడు గురుకుల పాఠశాలకు వచ్చిన ఎమ్మెల్యే బండారు శ్రావణికి వినతి పత్రం ఇచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే ఈ విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారమయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. వారి వెంట రాచేపల్లి పాండు, రామాంజనేయులు, సుధాకర్, తదితరులు ఉన్నారు.

ఆర్‌డిటికి ఎఫ్‌సిఆర్ఎను రెన్యువల్ చేయాలి

'సేవ్ ఆర్‌డిటి' పాదయాత్రలో శైలజనాథ్

ప్రజాశక్తి-కుందుర్పి

ఆర్‌డిటి సంస్థకు విదేశీ నిధులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం వద్ద ఎఫ్‌సిఆర్ఎను రెన్యువల్ చేయించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి సాకే శైలజనాథ్ విమర్శించారు. 'సేవ్ ఆర్‌డిటి' పేరుతో మాజీ ఎంపీ తలారి రంగయ్య చేపట్టిన పాదయాత్రలో బుధవారం ఆయనతో పాటు జడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఆర్‌డిటి ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలకు విశేష సేవలందిస్తుందన్నారు. కావున స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఈ పాదయాత్రను అడ్డుకోకుండా రంగయ్యతో కలిసి ఆర్‌డిటికి ఎఫ్‌సిఆర్ఎను రెన్యువల్ చేయించాలని కోరారు. అలాగే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నియోజకవర్గంలో రోడ్లు, బిటిపి ప్రాజెక్ట్ పనులు పూర్తి చేయించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజలే సరైన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. పాదయాత్రలో నాయకులు మాదినేని ఉమామహేశ్వర నాయుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిప్పేస్వామి, మండల కన్వీనర్ హనుమంత రాయుడు, ఎంపీపీ కమలా నాగరాజు, విజయకుమార్, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

గోకులం షెడ్డు ప్రారంభం

బ్రహ్మసముద్రం : బ్రహ్మసముద్రంకు చెందిన రైతు చాకలి చనమల్లప్ప వ్యవసాయ తోటలో నిర్మించిన గోకులం షెడ్డును బుధవారం టిడిపి మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు అధికారులు, నాయకులతో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు చొరవతో కళ్యాణదుర్గం తాలూకా లోనే బ్రహ్మసముద్రం మండలంలో అత్యధికంగా గోకులం షెడ్లు నిర్మించారన్నారు. వైసిపి ప్రభుత్వం రైతులను నానా ఇబ్బందులు పెట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెం టనే ఉపాధి హామీ ద్వారా రైతు వాటా 10 శాతంతో గోకులం (పశువుల) షెడ్ల నిర్మాణం చేపట్టింద న్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి ప్రభావతి, ఎంపీడీవో నందకిషోర్, ఈసీ జయప్రకాష్, ఫీల్డ్ అసిస్టెంట్ మోహన్‌రెడ్డి, సంతే కొండాపురం సర్పంచి వనితా మల్లికార్జున, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపిడిఒ కార్యాలయ ఏవోగా శేషారెడ్డి

ప్రజాశక్తి-నార్పల

ఎంపిడిఒ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా బుధవారం శేషారెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఉమాదేవి బదిలీపై జడ్పీ కార్యాలయానికి వెళ్లారు. శెట్టూరు ఎంపిడిఒ కార్యాల యంలో పనిచేస్తున్న శేషారెడ్డి సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడికి వచ్చారు. ఆయన ఎంపిడిఒ మమతాదేవిని కలిసి బాధ్యతలు స్వీకరిం చారు. ఆయన మాట్లాడుతూ ఎంపిడిఒ, కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది సహకారంతో కార్యాలయానికి వచ్చే ప్రజలకు సేవలందిస్తామని తెలిపారు. నూతన ఏవోకు కార్యాలయ సిబ్బంది సుబహాన్, రవీంద్రనాథ్‌రెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, సురేష్‌కుమార్, పార్వతమ్మ అభినందనలు తెలిపారు.

అంగన్వాడీ కార్యకర్త మృతి

ప్రజాశక్తి-బెళుగుప్ప

మండలంలోని నరసాపురం-2 అంగన్వాడీ కేంద్రంలో కార్యకర్తగా పని చేస్తున్న జి.కమ లమ్మ(60) మృతిచెందింది. ఆమె కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండేది. అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందింది విషయం తెలుసుకున్న సిడిపిఒ డాక్టర్ బిఎన్.శ్రీదేవి మట్టి ఖర్చుల కోసం రూ. 15వేలు కమలమ్మ బంధువులకు అందజేశారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ సురేఖ, అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

డంపింగ్ యార్డ్ పరిశీలన

యాడికి : స్థానిక చందన రోడ్డులో ఉన్న డంపింగ్ యార్డ్‌ను బుధవారం డివిజనల్ పంచా యతీ అధికారి విజయ్‌కుమార్‌రెడ్డి సందర్శించారు. తడి, పొడి చెత్తను వేరు చేసే విధానాన్ని, వర్మి కంపోస్టు తయారీ కేంద్రాన్ని పరిశీలించారు అనంతరం మూలనపడ్డ పంచాయతీ చెత్తను తీసుకెళ్లే రిక్షాలను పరిశీలించి, పనికి వచ్చే వాటికి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకు రావాలన్నారు. ఆయన వెంట సర్పంచి అనురాధ, ఎంపీడీవో వీర్రాజు, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మేంద్ర, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల నీటి తొట్టెలు ప్రారంభం

ఆత్మకూరు : పల్లె పండుగ కార్యక్రమం లో ఉపాధి హామీ నిధులతో మండలంలో నిర్మించిన పశువుల నీటి తొట్టెలను బుధవారం టిడిపి మండల కన్వీనర్ శ్రీనివాసులు, ఇన్‌ఛార్జి ఎపిఒ వెంకటనారా యణ, హిందూపురం పార్లమెంటు అధికార ప్రతినిధి శశాంక్‌బాబు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ వేసవి కాలంలో పశువుల దాహార్తి తీర్చడానికి ఎమ్మెల్యే పరిటాల సునీత మండలానికి 40 నీటి తొట్టెలు మంజూరు చేయించిందన్నారు. అయితే నిర్మాణం పూర్తయిన 30 తొట్టెలను ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటనారాయణ, అక్కులన్న, రవీంద్రారెడ్డి, కొండారెడ్డి, గోపాల్‌రెడ్డి, లక్ష్మీదేవమ్మ, దాసు, సుధాకర్, పోతన్న, సుధాకర్‌రెడ్డి, ఏకాంత్, ఆదెప్ప, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

అహుడా ఛైర్మన్ టిసి వరుణ్‌కు సన్మానం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అహుడా అనుబంధంగా పని చేస్తున్న లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్ సమస్యలను పరిష్కరిస్తామని అనంతపురం హిందూపురం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్ టిసి.వరుణ్ తెలిపారు. నగరంలోని అహుడా కార్యాలయంలో బుధవారం ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఎల్‌టిపిలు ఛైర్మన్ వరుణ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం నిర్వహిం చిన సమావేశంలో ఎల్‌టిపిలు పలు సమస్యలను ప్రస్తావించగా సాధ్యాసాధ్యాలపై చర్చించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వరుణ్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న అనధికార లేఅవుట్ల విషయంలో ఎల్‌టిపిలు సంపూర్ణ సహకారం అందించి అహుడా ఆదాయాన్ని గణనీయంగా పెంపొందించాలన్నారు. అహుడా అనుమతి పొందడం ద్వారా అక్కడ ప్లాట్లు కొనుగోలు చేసిన హక్కుదారులకు మెరుగైన వసతులు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో ప్లానింగ్ ఆఫీసర్ ఇషాక్, అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ హరీష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

టిసి వరుణ్‌ను సన్మానిస్తున్న లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్

అభివృద్ధి వైపు అడుగులు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తున్నా మని, మరో 10 నుంచి 15ఏళ్లు అధికారం మాదేనని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. నగరంలో సుమారు రూ. 2 కోట్లతో నిర్మించిన పలు అభివృద్ధి కార్యక్రమాలను బుధవారం ఆయన ప్రారంభిం చారు. 80 ఫీట్ రోడ్డు మార్గంలో రూ. కోటితో అయ్యప్ప స్వామి ఆలయం వరకూ వేసిన నూతన రోడ్డు ప్రారంభోత్సవం, రుద్రంపేట పంచాయతీలోని సవీరా ఆసుపత్రి వద్ద రూ. 50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, భైరవనగర్ ఎక్స్‌టెన్షన్‌లో రూ. 50 లక్షలతో చేపట్టిన రోడ్డు నిర్మాణాలను ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ నగరంలో ఇప్పటికే రూ. 30 కోట్లతో రోడ్లు, డ్రైనేజీలు నిర్మించామన్నారు. ఇంటింటికీ కొళాయి కనెక్షన్ అందిస్తున్నామని, 16 ఎంఎల్‌డి. వాటర్ ప్లాంట్ నిర్మాణం పూర్తయిందని, త్వరలోనే ప్రారంభిస్తామ న్నారు. రూ. 50కోట్లతో రోడ్డు, ఇతర అబివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. పార్కులను పూర్తిగా మార్చి వేస్తున్నామన్నారు.

అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ఎమ్మెల్యే యోగాసానాలు

వైద్య ఆరోగ్యశాఖ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని ఎస్ఎస్‌బిఎన్ కళాశాలలో నిర్వ హించిన యోగాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని అందరితో కలిసి యోగాసనాలు వేశారు. ఆయన మాట్లాడుతూ యువత గంజాయి, ఇతర డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధికా రులు, యువత, విద్యార్థులు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పొగాకు రహిత సమాజం నిర్మిద్దాం

ప్రజాశక్తి-అనంతపురం

పొగాకు రహిత సమాజం నిర్మిద్దామని జిల్లా పొగాకు నియంత్రణ సామాజిక కార్యకర్త శ్రీరాములు పిలుపునిచ్చారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ మాసోత్సవంలో భాగంగా బుధవారం నగరంలోని రుద్రంపేట, చంద్రబాబు కొట్టాలు అంగన్వాడీ సెంటర్లలో పొగాకు ఉత్పత్తుల కు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. శ్రీరాములు సిగరెట్‌తో పాటు ఇతర పొగాకు సంబంధిత ఉత్పత్తుల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి వివరించారు. ప్రజలు మంచి ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలని, పొగాకు, వాటి ఉత్పత్తులకు దూరంగా ఉండాలని సూచిం చారు. అనంతరం పొగాకు వినియోగానికి వ్యతిరేకం గా ప్రతిజ్ఞ చేయించారు. బహిరంగ ధూమపానం, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద సిగరెట్, ఇతర పొగాకు ఉత్పత్తులు అమ్మకూడదన్నారు. అతిక్రమించిన వారిపై చట్టం ప్రకారం చర్యలు, జరిమానా తప్పవన్నారు. పొగాకు ఉత్పత్తులపై ఎటువంటి ప్రచారం నిర్వహించరాదని తెలిపారు. కార్యక్రమంలో పిహెచ్ఎన్ పద్మావతి, ఎంఎల్‌హెచ్‌పి చంద్రిక, ఆశ, బాలింతలు, యువకులు పాల్గొన్నారు.

'శ్రీచైతన్య'లో అభినందన సభ

ప్రజాశక్తి-అనంతపురం

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రతిభా పురస్కారాలకు అనంతపురం జోన్ శ్రీచైతన్య విద్యాసంస్థల విద్యార్థులు 23 మంది ఎంపికయ్యారని ఎజిఎం సుబ్బారెడ్డి తెలిపారు. నగరంలోని కమ్మ భవన్ సమీపంలో ఉన్న శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బుధవారం అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎజిఎం మాట్లాడుతూ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఎటిపి-3 బ్రాంచ్ నుంచి ఇద్దరు, 5 బ్రాంచ్ నుంచి ముగ్గురు, 6 బ్రాంచ్ నుంచి ఒకరు, తాడిపత్రి బ్రాంచ్ నుంచి ఇద్దరు, కళ్యాణదుర్గం బ్రాంచ్ నుంచి ఐదుగురు, గుంతకల్లులోని 3 బ్రాంచ్‌ల నుంచి 10 మంది ఎంపికయ్యార న్నారు. పురస్కారాలు అందుకున్న విద్యార్థులను పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. అందుకోసం కృషి చేసిన ఉపాధ్యాయ బృందాన్ని, తల్లిదండ్రులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ విశ్వనాథ్, సమీనాఖాన్, తబస్సుమ్, వెంకటేష్, నరేష్, పర్వీన్‌బాను, నేత్రావతి, శాంత, రాధిక, ఫిలిప్, వీరేష్, పురుషోత్తం, నారాయణస్వామి, మధు, మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, కోఆర్డినేటర్లు రాధాకృష్ణ, తిరుమలేష్, నాగభూషణం, ఇర్షాద్, డీన్లు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులు, ఉపాధ్యాయ బృందాన్ని అభినందిస్తున్న ఎజిఎం